# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 29, జూన్ 2026


## పోలియో రహిత జిల్లా లక్ష్యంగా అందరూ కృషి చేయాలి

* నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, జూన్ 28, ప్రభాతవార్త:**

పోలియో రహిత సమాజ నిర్మాణంలో జిల్లాలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ పట్టణ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలియో వ్యాధి పూర్తి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి ప్రతి విడతలోనూ రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ వేయించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. గతంలో చుక్కలు వేసినప్పటికీ ప్రతిసారీ వేయించడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి మరింత పెరుగుతుందని వివరించారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా సమీప కేంద్రాలకు పిల్లలను తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పనిచేయాలని ఆదేశించారు. పోలియో రహిత నిర్మల్ జిల్లా లక్ష్యాన్ని వంద శాతం మిగతా 2లో..



# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

* రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్, జూన్ 28, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అనే ద్విసూత్రంతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఆదివారం భైంసా పట్టణంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి.. రూ.30.32 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు నిరుపేదల కోసం నిర్మించిన 440 డబుల్ బెడ్‌రూం గృహాలను అధికారికంగా ప్రారంభించారు. పట్టణంలో సామూహికంగా నిర్మించిన 440 డబుల్ బెడ్‌రూం గృహాల సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి, అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు, గృహ పట్టాలను పంపిణీ చేశారు. ఎన్నో ఏళ్ల సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత అమృత్ పథకం కింద రూ.28.18 కోట్లతో చేపట్టనున్న తాగునీటి సరఫరా వ్యవస్థ ఆధునికీకరణ, కొత్త పైప్‌లైన్ల నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అలాగే రూ.2.14 కోట్లతో చేపట్టనున్న మహదేవ్‌పూర్ చెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులతో భైంసా పట్టణ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు పెరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆలయ ప్రాంగణంలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన బహిరంగ సభ, గృహ పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. భైంసా పట్టణ సమగ్ర అభివృద్ధికి నిధుల కొరత లేదని, త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పాల్సికర్ రంగారావు ప్రాజెక్టు బాధితులకు ప్రభుత్వం తరఫున పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, అవినీతికి తావులేకుండా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోలు, కొత్త రేషన్ కార్డుల జారీ, త్వరలో కొత్త పింఛన్ల మంజూరు వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ.. ఈ నిధుల కేటాయింపు, అభివృద్ధి పనులతో భైంసా రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని అన్నారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మిగతా 2లో..

## సింగరేణి ఐరన్ పైపుల దొంగతనం

# కేసు ఛేదింపు

● ఆరుగురు నిందితులకు రిమాండ్

● రూ. 4.40 లక్షల సొత్తు, డీసీఎం వాహనం స్వాధీనం: శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్

**నస్పూర్, జూన్ 28, ప్రభాతవార్త**

సింగరేణి శ్రీరాంపూర్ సివిల్ కార్యాలయానికి చెందిన రూ. 4,40,000 విలువైన ఐరన్ పైపుల దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన సింగరేణి సూపర్‌వైజర్‌తో పాటు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి రిమాండ్ విధించినట్లు శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 25న సింగరేణి సివిల్ ఆఫీస్‌కు చెందిన సుమారు 110 ఐరన్ పైపులను ఎలాంటి అనుమతులు లేకుండా డీసీఎం వాహనంలో తరలిస్తుండగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. దీనిపై ఎస్ అండ్ పీసీ ఉద్యోగి జెట్టి నాగమల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. సింగరేణి సివిల్ సూపర్‌వైజర్ గంగళ్ల సందీప్ ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా, తనకు పరిచయం ఉన్న స్క్రాప్ వ్యాపారులతో కుమ్మక్కయ్యాడు. ఎవరికీ అనుమానం రాకుండా సింగరేణి ప్రభుత్వ ఆస్తులను లూటీ చేసి, అక్రమంగా తరలించడానికి ప్లాన్ వేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుండి రూ. 4.40 లక్షల విలువైన 110 ఐరన్ పైపులతో పాటు, మిగతా 2లో..

## భూవివాదంలో అన్న చేతిలో

# తమ్ముడు హతం

### చంద్రవల్లిలో దారుణ ఘటన

**బెల్లంపల్లి, జూన్ 28, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవల్లి గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భూవివాదం అన్నదమ్ముల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసి, చివరకు ఒకరి ప్రాణం తీసింది. గ్రామానికి చెందిన చందనవేని రాజేష్, అతని అన్న చందు మధ్య భూమి విషయంలో కొంతకాలంగా వివాదం మిగతా 2లో..

## రోడ్డు ప్రమాదంలో

# ఇంటర్ విద్యార్థి మృతి

* లారీని ఢీకొన్న కారు * ఒకరు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు
* మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై ప్రమాదం

**జైపూర్, జూన్ 28, ప్రభాతవార్త :**

మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల – చెన్నూర్ జాతీయ రహదారిపై శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి వెంకటసాయి (18) సంఘటనా స్థలంలో మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ ఎస్సై భూమేష్ తెలిపిన మిగతా 2లో..





ప్రమాదానికి గురైన కారు, వెంకటసాయి (ఫైల్‌ఫోటో)

## పోలియో రహిత జిల్లా లక్ష్యంగా అందరూ కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సాధించేందుకు ప్రతి ఇంటికి అవగాహన కల్పించాలని, ప్రజలంతా పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులను, పనులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి భైంసాను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ దత్తాత్రి, వైస్ చైర్‌పర్సన్ కుతిజ సిద్ధిక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సింగరేణి ఐరన్ పైపుల దొంగతనం కేసు ఛేదింపు

(మొదటిపేజీ తరువాయి)

రవాణాకు ఉపయోగించిన డీసీఎం వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

***అరెస్టయిన నిందితుల వివరాలు:***

గంగళ్ల సందీప్ (సింగరేణి సివిల్ సూపర్‌వైజర్) ప్రధాన నిందితుడు, ముప్పు రాజు (ప్రైవేట్ సివిల్ ఆఫీస్ ఉద్యోగి), మహమ్మద్ హకీమ్ (డీసీఎం వాహన డ్రైవర్), తూర్పటి జంపయ్య, చింతల సమ్మయ్య, బతినీ నరేష్ గౌడ్ (స్క్రాప్ వ్యాపారి). కేసు దర్యాప్తు పూర్తి చేసిన అనంతరం నిందితులను విచారించి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారికి రిమాండ్ విధించిందని, తదనంతరం నిందితులను జైలుకు తరలించినట్లు శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ పేర్కొన్నారు. సింగరేణి ఆస్తుల దొంగతనానికి పాల్పడితే ఎంతటి వారిపైనైనా కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

## భూవివాదంలో అన్న చేతిలో తమ్ముడు హతం

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆదివారం మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని, అది తీవ్రరూపం దాల్చింది. మాటామాట పెరిగి కోపోద్రిక్తుడైన అన్న చందు, తమ్ముడు రాజేష్‌పై గొడ్డలితో దాడి చేయడంతో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. భూమి కోసం జరిగిన ఈ గొడవ రక్తసంబంధాన్ని రక్తసిక్తం చేసింది. సమాచారం అందుకున్న వెంటనే బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, రూరల్ సీఐ హనోక్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు రాజేష్‌కు భార్య రవళి, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై తాళ్ళ గురజాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి

(మొదటిపేజీ తరువాయి)

వివరాల ప్రకారం.. మంచిర్యాలలో నివాసం ఉంటున్న పద్మ శ్రీనివాస్ వారి కుమారుడు వెంకటసాయి, మృతుడి నాయినమ్మ ఉదయలక్ష్మి నలుగురు కలిసి వారి ఆటోకారులో పెద్దపల్లిలో శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో సాయంత్రం ఇందారం ఎక్స్‌రోడ్ దాటిన కొద్దిదూరంలో లారీ ఎలాంటి ట్రాఫిక్ నియమాలు పాటించకుండా అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నిలిపి ఉండడం వలన కారు నడుపుతున్న కారు డ్రైవర్ శ్రీనివాస్ లారీని గమనించకపోవడం వల్ల లారీ వెనుకభాగానికి ఢీ కొనడంతో ముందు సీటులో కూర్చుని ఉన్న వెంకటసాయి అక్కడికక్కడే మృతిచెందాడని, మిగిలిన ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి రలించినట్లు తెలిపారు. మృతుని తల్లిదండ్రులు వృత్తిరిత్య ప్రభుత్వ ఉపాధ్యాయులు. మృతుడి తల్లి నరేందుల పద్మ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# బాసర అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

### * ఆలయ అభివృద్ధి పనులపై కీలక సమీక్ష



**భైంసా, జూన్ 28, ప్రభాతవార్త:**

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసర మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖద్వారం వద్దకు చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, వేద పండితులు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం చేశారు. అనంతరం, ఇటీవల ఆలయ ప్రాంగణంలో చోరీ జరిగిన మహంకాళి అమ్మవారి ఉపాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా సందర్శించి ఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. ఆలయంలో భద్రతా లోపాలు తలెత్తకుండా సిసి కెమెరాల నిఘా పెంచాలని, సెక్యూరిటీ ఏర్పాట్లపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీసు, ఆలయ అధికారులను ఆదేశించారు. అంతకుముందు బాసరలోని ఇంద్రప్రస్థ ప్రభుత్వ అతిథి గృహంలో (గెస్ట్ హౌస్) శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, మాస్టర్ ప్లాన్ టెండర్ల ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) జానకి, ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) అంజనాదేవితో కలిసి మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాసర క్షేత్రానికి దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు కల్పించాల్సిన వసతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన వేగవంతం చేసి పనులను ప్రారంభించాలని అధికారులను గట్టిగా ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, బాసర గ్రామ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగవైకల్యాన్ని రూపుమాపడానికే పోలియో చుక్కలు

### - మార్కెట్ కమిటీ చైర్మన్, సర్పంచ్

**జైనూర్, జూన్ 28, ప్రభాతవార్త:**



మన పిల్లల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని, సమాజం నుండి అంగవైకల్యాన్ని పూర్తిగా రూపుమాపడానికే ప్రభుత్వం ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథరావు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్ తెలిపారు. ఆదివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై, చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథరావు, సర్పంచ్ కొడప ప్రకాష్ మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు వయసున్న ప్రతి ఒక్క చిన్నారికి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. చిన్న వయసులో వేసే ఈ రెండు చుక్కలు పిల్లలను జీవితాంతం పక్షవాతం, అంగవైకల్యం బారిన పడకుండా కాపాడతాయని పేర్కొన్నారు. మండలంలో ఒక్క చిన్నారి కూడా విస్మరణకు గురికాకుండా వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని వైద్య సిబ్బందికి సూచించారు. పోలియో రహిత ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతిసారి రెండు చుక్కలతోనే పోలియోపై నిరంతర విజయం సాధ్యం: మేయర్

**నస్పూర్, జూన్ 28, ప్రభాతవార్త**



ప్రతిసారి రెండు చుక్కలు వేయించడం ద్వారానే పోలియో మహమ్మారిపై నిరంతర విజయం సాధ్యమవుతుందని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కుటుంబ సంక్షేమ శాఖ, మిషన్ డైరెక్టర్ ఎన్‌హెచ్‌ఎం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలియో దినం కార్యక్రమాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్ ఆదిత్య స్కూల్‌లో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల లోపు వయస్సు గల పిల్లలకు పోలియో చుక్కలు వేసిన మేయర్, చిన్న పిల్లలకు ఈ చుక్కలు వేయించాల్సిన అవశ్యకత గురించి తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల భవిష్యత్తును సురక్షితంగా మార్చడానికి పోలియో చుక్కల కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మేయర్ ధర్ని మధుకర్ వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అర్హులైన పిల్లలందరికీ వంద శాతం పోలియో చుక్కలు అందేలా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్‌తో పాటు స్థానిక ఏఎన్‌ఎం కవిత, 32వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపతి తిరుపతి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న బెల్లంపల్లి తిలక్ వాకర్స్ అసోసియేషన్

### - ఆటో డ్రైవర్ కుటుంబానికి 33 వేల రూపాయల ఆర్థిక సహాయం

**బెల్లంపల్లి, జూన్ 28, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో మానవత్వానికి నిదర్శనంగా నిలిచే ఒక స్ఫూర్తిదాయక సంఘటన చోటుచేసుకుంది. బెల్లంపల్లి పట్టణంలోని టేకుల బస్తీలో నివసిస్తున్న పేద ఆటో డ్రైవర్ కాటం రవికుమార్ కుటుంబానికి తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి 33,000 రూపాయల ఆర్థిక సహాయం అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. రవికుమార్ భార్య కాటం స్రవంతి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని లక్ష్మీనరసింహ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలియజేయడంతో చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమయ్యాయి. అయితే, రోజువారీ ఆదాయంపై ఆధారపడే ఈ నిరుపేద కుటుంబానికి ఆ ఖర్చులను భరించడం కష్టసాధ్యమైంది. ఈ క్లిష్ట పరిస్థితిలో రవికుమార్ సహాయం కోసం ఆటో డ్రైవర్స్ గ్రూపులు, స్నేహితులు, దాతలను సంప్రదించగా, అనేక మంది స్పందించి తమ వంతు సహకారం అందించారు. ఈ క్రమంలో తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా ముందుకు వచ్చి, తమ సభ్యుల నుండి చందాలు సేకరించి 33,000 రూపాయల సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇలాంటి క్లిష్ట సమయంలో మా సహచర డ్రైవర్ కుటుంబాన్ని గుర్తించి ఆదుకున్న తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు మేము ఎప్పటికీ రుణపడి ఉంటాం. వారి సహాయం మా కోసం ఎంతో విలువైనది అని కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, టేకుల బస్తి కౌన్సిలర్ మరియు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంటనే స్పందించి, స్రవంతి చికిత్స కోసం ఎల్ఓసీ మంజూరు చేయాలని యూనియన్ డిమాండ్ చేసింది. అదేవిధంగా, నివాసం లేని ఈ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. గమనించదగ్గ విషయం ఏమిటంటే, రవికుమార్‌కు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ప్రస్తుతం కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో పాటు, స్థిర నివాసం కూడా లేక ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు బెల్లంపల్లి ఆటో యూనియన్ అధ్యక్షుడు కట్ట రామ్ కుమార్, కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బాలసదనములో పిల్లలకు పూర్తి సౌకర్యాలు

**✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూన్ 28, ప్రభాతవార్త**

బాలసదనములో పిల్లలకు అవసరమైన వసతి, భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాలసదనం భవనాన్ని మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకంలో 1 కోటి 34 లక్షల 93 వేల రూపాయల వ్యయంతో బాలసదనం భవన నిర్మాణం చేపట్టి అతి తక్కువ సమయంలో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. బాలసదనం లో 60 మంది పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, ఫర్నిచర్, వసతి గదులు, మూత్రశాలలు ఇతరత్రా కల్పించడం జరిగిందని, వాచ్ మెన్, వంట మనిషి ఇతర సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. బాలసదనములో వసతి పొందుతూ అర్హత గల బాలికలను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలకు పంపించి విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. బాల్యవివాహాల బాధితులు, లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, అనాధలు, నిరాశ్రయులు, సంరక్షణ అవసరం ఉన్న పిల్లలకు సురక్షిత ఆశ్రయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. సంరక్షణ, విద్య, వైద్య సేవలు, కౌన్సిలింగ్, పునరావాస సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.

మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ అనాధలు, నిరుపేద పిల్లల సౌకర్యం కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో బాలసదనం ఏర్పాటు చేయడం జరిగిందని, పిల్లలకు ఎల్లప్పుడూ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి పోషణ చూడడం జరుగుతుందని తెలిపారు. బాలికలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, బాలసదనం పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం అందరి సమిష్టి కృషితోనే సాధ్యపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి అధికారులు, బాలసదనం నిర్వాహకులు, సంబంధిత అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.





## పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, జూన్ 28, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ అధికారికంగా ప్రారంభించారు. చిన్నారులకు ఆయన స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు అయిన చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఐదేళ్లలోపు వయసున్న ప్రతి ఒక్క చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లులకు విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## బజార్‌హత్నూర్‌లో పల్స్ పోలియో కార్యక్రమం

**బజార్‌హత్నూర్, జూన్ 28, ప్రభాతవార్త:**

బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పరచ సాయన్న ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పరచ సాయన్న మాట్లాడుతూ.. నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో అవసరమని, ఐదేళ్లలోపు వయసున్న ప్రతి ఒక్క చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు బాటలు వేయాలని సూచించారు. మండలంలో అర్హులైన చిన్నారులందరికీ పోలియో చుక్కలు అందేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేయాలన్నారు. పోలియో మహమ్మారి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సూర్య ప్రకాష్, ఏఎన్ఎం గంగుబాయి, ఆశా వర్కర్ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం

**సారంగాపూర్, జూన్ 28, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలపై గ్రామాలలో హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు ముందస్తుగా విరివిగా ప్రచారం చేశారు. మండలవ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో చిన్నారులకు పోలియో చుక్కలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక కేంద్రాలతో పాటు ఇంటింటికి వెళ్లి చుక్కలు వేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ పరచ సాయన్న

## దిలావర్‌పూర్‌లో పురాతన విగ్రహం లభ్యం

**దిలావర్‌పూర్, జూన్ 28, ప్రభాతవార్త:**



దిలావర్‌పూర్ మండల కేంద్రంలో మరో పురాతన రాతి విగ్రహం బయటపడడంతో ఈ ప్రాంత చరిత్ర మళ్లీ చర్చనీయాంశమైంది. గ్రామానికి చెందిన నడుకుడా పోశెట్టి ఇంటి సమీపంలోని తోట బావిలో ఆదివారం జేసీబీతో తవ్వకాలు జరపగా ఈ శిలా విగ్రహం లభ్యమైంది. బావిలో విగ్రహం ఉందన్న సమాచారంతో ఉపసర్పంచులు నడుకుల సుఖేష్, రవి ఆధ్వర్యంలో ఈ తవ్వకాలు చేపట్టారు. ఈ విగ్రహాన్ని పరిశీలించిన స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయులు నంద అనిల్, అన్వేష్ రెడ్డి, పసుల పవన్ మాట్లాడుతూ.. ఇది వందల సంవత్సరాల నాటి వీరగల్లు (మహావీరుడు) విగ్రహంగా ప్రాథమికంగా భావిస్తున్నట్లు తెలిపారు. పురావస్తు శాఖ అధికారులు పరిశీలిస్తేనే దీని పూర్తి కాలం, చారిత్రక ప్రాధాన్యత తెలుస్తుందని పేర్కొన్నారు. దిలావర్‌పూర్‌లో గతంలోనూ కాకతీయుల కాలం నాటి కట్టడాలు, బౌద్ధ స్తూపాలు, కన్నడ శిలాశాసనాలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ పురావస్తు శాఖతో సమగ్ర తవ్వకాలు జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

## బాధితుడికి భోస్లే మోహన్‌రావు పాటిల్ పరామర్శ

**- అండగా ఉంటామని భరోసా**

**భైంసా, జూన్ 28, ప్రభాతవార్త:**



ప్రమాదవశాత్తు గాయపడి భైంసా పట్టణంలోని జీడీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాసర మండలం ఓని గ్రామానికి చెందిన ప్రసాద్‌ను భోస్లే మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్ ఆదివారం పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న ఆయన ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మోహన్ రావు పాటిల్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీసి, బాధితుడికి ట్రస్ట్ తరఫున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రసాద్ తో పాటు వారి కుటుంబ సభ్యులు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకూడదని, ధైర్యంగా ఉండాలని మనోధైర్యాన్ని కల్పించారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజమే లక్ష్యం

**దిలావర్‌పూర్, జూన్ 28, ప్రభాతవార్త:**



దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. పోలియో మహమ్మారి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని కోరారు. మండలంలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా విస్మరణకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ అక్షరా అనిల్ మాట్లాడుతూ.. గ్రామంలోని ఐదేళ్లలోపు ప్రతి ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రజలు, ముఖ్యంగా తల్లులు ఆరోగ్య శాఖ సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేశ్వర్, ఏఎన్ఎం పుష్ప, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి టీచర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోడ్డుపై వర్షపు నీరు.. ఇబ్బందుల్లో వాహనదారులు

**ఆసిఫాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గల వివేకానంద చౌక్ సమీపంలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదివారం ఉదయం పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, 6వ వార్డు కౌన్సిలర్ చిలువేరు వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య కలిసి పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ప్రజా ప్రతినిధులు మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. భవిష్యత్తులో మళ్లీ వర్షం పడినా నీరు నిల్వ ఉండకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.



వివేకానంద చౌక్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ పరిశీలన

అక్కడినుంచి పాత కూరగాయల మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ చెత్తాచెదారం వేయవద్దని చుట్టుపక్కల ఉన్న వ్యాపారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల డ్రైనేజీలు మూసుకుపోవడమే కాకుండా, దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని వ్యాపారులకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మున్సిపల్ వాహనాల్లోనే చెత్తను వేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



ఎస్ఓటు జీఎం సత్యనారాయణను శాలువాతో సత్కరిస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

## శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటు జీఎంకు ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం

**నస్పూర్, జూన్ 28, ప్రభాతవార్త**

సింగరేణిలో ఉన్నత విలువలు, క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన అధికారిగా నల్లగుంట సత్యనారాయణ విశేష గుర్తింపు పొందారని ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు కొనియాడారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటు జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ పొందనున్న నల్లగుంట సత్యనారాయణకు బంగ్లాస్ ఏరియాలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఐఎన్టీయూసీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. సత్యనారాయణ సింగరేణిలో ఆర్కే 6 గని మేనేజర్‌గా, ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్‌గా, కైరిగూడ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సంస్థ అభివృద్ధికి విశేష సేవలందించారని ఈ సందర్భంగా శంకర్ రావు గుర్తుచేశారు. సత్యనారాయణ సుదీర్ఘకాలం సింగరేణిలో సేవలందిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను, భద్రతను సమన్వయం చేస్తూ తోటి అధికారులకు ఆదర్శంగా నిలిచారని ఐఎన్టీయూసీ నాయకులు ప్రశంసించారు. గనుల్లో ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి భద్రతా ప్రమాణాల అమలులో ప్రత్యేక శ్రద్ధ చూపించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా తమ అపార అనుభవాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర నాయకులు గరిగ స్వామి, పి. తిరుపతి రాజు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ శాఖలో పని చేస్తున్న వర్క్ ఇన్స్పెక్టర్ల వేతనాలు విడుదల చేయాలి

**ఆసిఫాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :**

ఇరిగేషన్ శాఖలో వర్క్ ఇన్స్పెక్టర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయాలని ఆ శాఖలో పనిచేస్తున్న వర్క్ ఇన్స్పెక్టర్లు నగరారే అరుణ్ కుమార్ ఆదివారం డిమాండ్ చేశారు. గత మూడు నెలల నుండి వేతనాలు రాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. 2008 సంవత్సరంలో గృహనిర్మాణ శాఖలో పొరుగు సేవలపై నియమితులయ్యామని, 2016లో గృహ నిర్మాణశాఖ ఎత్తివేయడంతో అందులో పని చేస్తున్న వర్కిన్స్పెకర్ లను సాగు నీటి శాఖకు కేటాయించారని గుర్తుచేశారు. అప్పటి నుండి రెగ్యులర్ గా వేతనాలు చెల్లించారని, గత 3 నెలలుగా వేతనాలు నిలిపివేయడంతో అందులో పనిచేస్తున్న వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు, ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించి తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని

### - ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :**

జాతీయ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన పోలియో కార్యక్రమాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబ చిన్నారికి స్వయంగా రెండు చుక్కల పోలియో డ్రాప్స్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో డ్రాప్స్ వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని అన్నారు. పోలియో నిర్మూలనలో దేశం ఇప్పటికే గొప్ప విజయాన్ని సాధించిందని, ఆ విజయాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, బూత్‌కు రాలేని చిన్నారుల కోసం సోమవారం, మంగళవారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పోలియో డ్రాప్స్ వేస్తారని తెలిపారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, స్థానిక కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ముమ్మరంగా సర్ ఓటరు సర్వే...

**ఆసిఫాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :**

భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం(సర్) రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలో అత్యంత చురుగ్గా సాగుతోంది. ఆదివారం గ్రామపంచాయతీలో ప్రతి వార్డులో అధికారులు, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్తూ ఓటర్ల వివరాలను పరిశీలించి, వారికి సర్ ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. రాజంపేట గ్రామ ప్రజలందరూ తమ ఇళ్లకు వచ్చే సర్వే అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించి ఓటరు జాబితా ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ సర్వే కార్యక్రమంలో వార్డు సభ్యుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు జావిద్, స్థానిక వార్డు సభ్యులు వేణు, లావణ్య, కిషోర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్బు, ఆసిఫ్, జిపిఓ వామన్, బిఎల్ఓ శ్రీలక్ష్మి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 28, ప్రభాతవార్త :**



భావితరాల ఆరోగ్య భద్రత కోసం పోలియో రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని 6, 20వ వార్డుల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, జేబా షేక్, కమిషనర్ అంజయ్య, స్థానిక నాయకులతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సమద్, సాయి శ్రావణ్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందాలి

### - కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్ - బారెగూడలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :**



భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను మండల తహసీల్దార్ ఎం. మధుకర్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) చేపడుతున్న ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల నమోదు తీరును పరిశీలించిన అధికారులు, ప్రతి అర్హత కలిగిన ఓటరికి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితానే పునాదిగా నిలుస్తుందని అన్నారు. గ్రామంలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని సక్రమంగా నింపి ఎన్నికల సిబ్బందికి అందజేసి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం అధికారులు సర్వే నిర్వహణ, ఫారాల పంపిణీ పురోగతిపై ఆరా తీసి, నిర్ణీత గడువులోగా నాణ్యతతో కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది శ్రీదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయవంతం

### - 36 కేంద్రాల్లో 2,076 మంది చిన్నారులకు పోలియో చుక్కలు

**పెంచికల్‌పేట్, జూన్ 28, ప్రభాతవార్త :**



జాతీయ పల్స్ పోలియో 2026 కార్యక్రమం ఆదివారం మండల వ్యాప్తంగా విజయవంతం అయినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ అశ్రీన్ తెలిపారు. కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారన్నారు. మొత్తం 36 పాలియో కేంద్రాల్లో 05 సంవత్సరాల వయస్సు గల 2,076 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అఫీసర్లు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, పార్మాసిస్టులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సమన్వయంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత

### - తాండూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఝాన్సీ రాణి

**తాండూర్, జూన్ 28, ప్రభాతవార్త :**

పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ రాణి అన్నారు. మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు చుక్కల పోలియో మందు చిన్నారి భవిష్యత్తుకు రక్షణ అన్నారు. 05 సంవత్సరాలు లోపు 2723 మంది చిన్నారులకు పోలియో చుక్కలు మందు వేయాల్సి ఉండగా 95 శాతం మంది చిన్నారులకు చుక్కల మందు వేశామన్నారు. సోమ, మంగళవారం రెండు రోజులపాటు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసుకొని అర్హులైన చిన్నారులకు చుక్కల మందు వేస్తారని తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన 21 పోలింగ్ కేంద్రాల వద్దకు ఐదు సంవత్సరాలు లోపు చిన్నారులను వారి తల్లిదండ్రులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కల మందు వేశారు.

## కెరమెరిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

**కెరమెరి, జూన్ 28, ప్రభాతవార్త:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలోని చందుగూడ అంగన్వాడీ కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జాదవ్ అనసూయ, ఆశ వర్కర్ సిడం సరోజా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాజిద్, దేశముఖ్, రాథోడ్ సుదర్శన్, సుజాయిత్ ఖాన్, దండుగుల వెంకట్, షైక్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటి సర్వేతో ఓటరు జాబితా సవరణ వేగవంతం

### - ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. హరిత - అర్హులందరి వివరాలు నమోదు చేయాలని అధికారులకు ఆదేశం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :**



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ కె. హరిత

జిల్లాలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటి సర్వే నిర్వహణ, ఓటర్ల వివరాల నమోదు, ఫారాల సేకరణ తీరును స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని చెప్పారు. సర్వే పనులను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని, ప్రతి దశను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓ, మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి, తహసీల్దార్ ఎం. మధుకర్, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో పీజీ కళాశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

**బెల్లంపల్లి, జూన్ 28, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నూతనంగా మంజూరైన పీజీ కళాశాల భవన నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించబడింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చేతుల మీదుగా ఈ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంతో, కళాశాలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన భవన నిర్మాణానికి అంకురార్పణ జరిగింది.

### కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా... ఎమ్మెల్యే వినోద్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందేలా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ ఈ కళాశాలలో అద్భుతమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ప్రభుత్వ విద్యా సంస్థల్లో లభిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్, కార్యాలయ సిబ్బంది, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బెల్లంపల్లి స్టడీ సెంటర్ కౌన్సిలర్లు, ఉద్యోగులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## 32 డివిజన్‌లో ముమ్మరంగా ఓటర్ల సవరణ సర్వే

**నస్పూర్, జూన్ 28, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్ లో ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ ఇంటింటి సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఆదివారం జరిగిన సర్వే కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మేయర్ ధర్ని మధుకర్, పీసీసీ సభ్యులు నూకల రమేష్ పాల్గొని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పొందేలా, అలాగే ఓటర్ల జాబితాలో తప్పుల సవరణల కోసం ఈ సర్వేను ఉపయోగించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజమే లక్ష్యం

**లింగాపూర్, జూన్ 28, ప్రభాతవార్త :**



లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులందరికి పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ స్థానిక సర్పంచ్ జాధవ్ రాజశేఖర్ ఈరోజు అధికారికంగా ప్రారంభించారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాధవ్ రాజశేఖర్ మాట్లాడుతూచిన్నారుల భవిష్యత్తుకు పోలియో చుక్కలు రక్షణ కవచం లాంటివి. మన గ్రామంలో ఐదేళ్లలోపు ఉన్న ప్రతి ఒక్క చిన్నారికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారిని ఆరోగ్యంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. లింగాపూర్ గ్రామ నీ వంద శాతం పోలియో రహిత గ్రామంగా మార్చడమే మన లక్ష్యం. గ్రామంలోని ప్రతి ఇల్లాలు, తల్లిదండ్రులు తమ పిల్లలను పోలియో బూత్‌లకు తీసుకువచ్చేలా విస్తృత అవగాహన కల్పించారు. ఆదివారం సెలవు రోజైనా పిల్లల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది సేవలను సర్పంచ్‌అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ జాటోత్ రాహుల్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జాధవ్ రమేష్, రాథోడ్ బావురావు వార్డు సభ్యులు రాథోడ్ గోవింద్ మరియు పేసా కోఆర్డినేటర్ అర్కా సుదర్శన్, మెస్రం అశోక్ ఆరోగ్య శాఖ సిబ్బంది ,ఆశ వర్కర్ ,అంగన్వాడీ టీచర్, ఆయా వర్కర్ లబ్ధిదారులు తల్లిదండ్రులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల నివారణకు నగర పాలక సంస్థ సిద్ధమేనా..?

### దోమల నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల్లో ఆందోళన - ముందస్తు చర్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న నగరవాసులు

**మంచిర్యాల, జూన్ 28, ప్రభాతవార్త**

వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నగర కార్పొరేషన్ పరిధిలో నివసిస్తున్న ప్రజలు అంటువ్యాధుల నివారణపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాలు కురిసిన వెంటనే దోమల పెరుగుదల, మురుగు నీరు నిల్వ ఉండడం, చెత్త పేరుకుపోవడం వంటి కారణాలతో జ్వరాలు, కలరా, విరేచనాలు వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం పెరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో నగర పాలక సంస్థ అధికారులు ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే ప్రశ్న ప్రజల్లో ఉత్కంఠ కలిగిస్తోంది. కాలనీలు, మురుగు కాలువలు, చెత్త కుప్పలు ఉన్న ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టారా? నిల్వ నీరు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు ఉన్నాయా? దోమల నివారణకు మందు పిచికారీ, పొగ వదిలే కార్యక్రమాలు ఎంతవరకు నిర్వహిస్తున్నారు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ ఎత్తులో ఉన్న కాలనీల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వేగంగా విస్తరిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. చెత్త సకాలంలో తొలగించకపోతే దుర్వాసనతో పాటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత తాగునీటి వల్ల కలరా వంటి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో తాగునీటి నాణ్యతపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. నీటి సరఫరా కేంద్రాలను తనిఖీ చేసి పరిశుభ్రతను నిర్ధారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలం పూర్తిగా ప్రారంభమయ్యేలోపు నగర పాలక సంస్థ అధికారులు సమగ్ర కార్యాచరణ చేపట్టి ప్రజారోగ్య రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని అవసరమని పలువురు సూచిస్తున్నారు.

## భారత దేశాన్ని విశ్వగురువుగా నిలపడమే బీజేపీ లక్ష్యం

### - బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :**

భారత దేశాన్ని ప్రపంచంలో విశ్వగురువు స్థానంలో నిలబెట్టడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి తొమ్మిది జిల్లాల్లో నూతన బీజేపీ జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవంలో భాగంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ఆదివారం జాతీయ నాయకుడు నితిన్ నబి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్యకర్తల కష్టమే బీజేపీని దేశంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలబెట్టిందన్నారు. దేశ అభివృద్ధి, సుపరిపాలన, పేదల సంక్షేమం, జాతీయత భావజాలంతో బీజేపీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగేలా నాగేశ్వరరావు, వీరభద్ర చారి, రాష్ట్ర నాయకులు కొట్నాక విజయ్, షేర్ల మురళి, భువనగిరి సతీష్‌బాబు, కృష్ణకుమారి, కోవా విజయ్‌తో పాటు జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా మోర్చా అధ్యక్షులను పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



## చింతగూడ, కోయవాగు గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం

### - ఉప సర్పంచులు ఆత్రం ఆకాశ్, మోరారి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభం

### - ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని పిలుపు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 28, ప్రభాతవార్త :**





పల్స్ పోలియో జాతీయ కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ, కోయబాబు గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ఉప సర్పంచులు ఆత్రం ఆకాశ్, మొరారి శ్రీనివాస్‌లు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూసుకోవాలని కోరారు. ఆదివారం పోలియో బూతుల్లో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని రేపటి నుండి రెండు రోజుల పాటు వైద్య సిబ్బంది మరియు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వచ్చి పోలియో డ్రాప్స్ వేస్తారని తెలియజేశారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తల్లిదండ్రులు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు. కార్యక్రమానికి వచ్చిన తల్లిదండ్రులకు పోలియో టీకా ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రతి అర్హత కలిగిన చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ఇంటింటి సర్వే చేపడతామని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలపై అంజనీపుత్ర యాజమాన్యం ఘాటు స్పందన

### దుష్ప్రచారం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు - పరువు నష్టం దావాలకు సిద్ధమని స్పష్టం

**మంచిర్యాల, జూన్ 28, ప్రభాతవార్త**




అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలపై సంస్థ యాజమాన్యం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు కావాలనే అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించింది. ఇటువంటి తప్పుడు వార్తలను తయారు చేసి ప్రచారం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించింది. నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటి వెనుక ఉన్న వ్యక్తుల అసలు ముఖాలు త్వరలో బయటపడతాయని యాజమాన్యం పేర్కొంది. డిజిటల్ వేదికలను ఆశ్రయించి దుష్ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి, వారిపై పరువు నష్టం కేసులు నమోదు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ పారదర్శకత, నమ్మకం, విశ్వసనీయతలతో ముందుకు సాగుతోందని, వినియోగదారుల విశ్వాసమే తమకు అతిపెద్ద బలమని యాజమాన్యం తెలిపింది. ఎలాంటి కుట్రలు, అడ్డంకులు వచ్చినా వాటిని అధిగమిస్తూ సంస్థ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సంస్థ యాజమాన్యం కోరింది. న్యాయం వైపే తమ ప్రయాణమని, తప్పుడు ప్రచారాలకు చట్టబద్ధంగానే సమాధానం ఇస్తామని హెచ్చరించింది.



## మంచిర్యాలలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం

### ఐదు సంవత్సరాలలోపు 76,367 మంది చిన్నారులకు పోలియో చుక్కలు

**మంచిర్యాల, జూన్ 28, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పురపాలక మేయర్ ధరణి మధుకర్, ఉప మేయర్ రమ్య, స్థానిక కార్పొరేటర్లు, వార్డు కౌన్సిలర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, కార్యక్రమ అధికారులు డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ అనిల్, డాక్టర్ అశోక్, డాక్టర్ సతీష్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీధర్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా కార్యక్రమ అధికారి ప్రశాంతి, ప్రజారోగ్య నర్సింగ్ అధికారి పద్మ, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు కాకిరాల వెంకటేశ్వర్లు, నాందేవ్, అల్లాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రిలో ఈరోజు జన్మించిన చిన్నారుల తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖతో పాటు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు మొత్తం 76,367 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, మందుల నిల్వ గిడ్డంగులు, అత్యవసర వైద్య కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సహకరించాలని ఆయన కోరారు.

## ఉస్మానియా యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పరి ఎల్లేష్ జన్మదిన వేడుకలు

**బెల్లంపల్లి, జూన్ 28, ప్రభాతవార్త**

ఉస్మానియా యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పరి ఎల్లేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలు ప్రముఖులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థి నాయకులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలకు ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ కొండ నాగేశ్వరరావు, ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ కురిమల శ్రీనివాస్, మాల మహానాడు చైర్మన్ మందాల భాస్కర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహకార్యదర్శి గ్యార నరేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ఉప్పరి ఎల్లేష్ విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తిగా కొనియాడారు. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం, పరిపాలనా పారదర్శకత, సేవా దృక్పథం వంటి అంశాలలో ఆయన చూపిన నిబద్ధత ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. అలాగే సమాజ సేవలోనూ ఎల్లేష్ చురుకుగా పాల్గొంటూ, అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. యువతకు మార్గదర్శకుడిగా, సామాజిక బాధ్యత కలిగిన నాయకుడిగా ఆయన పాత్ర విశేషమని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనను ఘనంగా సత్కరించారు. పలువురు స్నేహితులు, సహచరులు, అభిమానులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొని ఎల్లేష్ తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పరి ఎల్లేష్ మాట్లాడుతూ తనపై చూపుతున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా విద్యా మరియు సామాజిక రంగాలలో సేవలు కొనసాగిస్తానని తెలిపారు.

